సాక్షి నిర్మల్

ఆదివారం । 3 । డిసెంబర్ । 2023

ఎవరు గెలిచినా..!!



ఎన్నికల ఫలితాలు ఆదివారం వెలువడనున్నాయి. గెలిచే నాయకులు హామీల అమలు, ప్రజాసమస్యల పరిష్కారం దిశగా శ్రమిస్తే వారి రాజకీయ భవిష్యత్తుకు పునాదులు పడతాయి. 8లో ▸



పంటలపై 'మిచాంగ్' ప్రభావం..!

సోయా పంట రైతులకు కన్నీళ్లే మిగిల్చింది. వరి, పత్తి ఆదుకుంటాయనుకుంటే మిచాంగ్ తుపాను ప్రభావంతో ఆందోళన చెందుతున్నారు. 9లో ▸

గరిష్టం/కనిష్టం
32.2/21.1

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. తుపాను కారణంగా చలి ప్రభావం తగ్గుతుంది. గాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కబడ్డీ మహిళా జట్టు ఎంపిక



కబడ్డీ ఆడుతున్న మహిళలు

నిర్మల్ రూరల్: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వాసవి వరల్డ్ స్కూల్‌లో మహిళా కబడ్డీ జట్టును శనివారం ఎంపిక చేశారు. ఈ పోటీలను జిల్లా క్రీడల ఇన్‌చార్జి అధికారి నఫీఖాన్, సెక్రటరీ సునీల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఆటలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని పేర్కొన్నారు. అనంతరం జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఈనెల 4, 5, 6, 7 తేదీలలో నిజామాబాద్ జిల్లా బుస్సాపూర్‌లో జరిగే 70వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు పాల్గొంటుందని ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రేమలత తెలిపారు. ఇందులో అధికారులు భూపతిరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శైలజ, జేవీఎస్‌ఆర్ పాఠశాల ప్రిన్సిపాల్ మరియమ్మ, జాయింట్ సెక్రెటరీ రాము, వ్యాయామ ఉపాధ్యాయులు భూమన్న, గంగాధర్, రాజు పాల్గొన్నారు

జిల్లాకు చేరిన సైకిల్ యాత్ర



అంజనేయులును సన్మానిస్తున్న శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్:కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలన్న కోరికతో గుంటూరు జిల్లా వినుకొండ గ్రామం నుంచి నాగ ఆంజనేయులు చేపట్టిన సైకిల్ యాత్ర శనివారం నిర్మల్ పట్టణానికి చేరుకుంది ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావును కలిశారు. ఈ సందర్భంగా ఆంజనేయులును డీసీసీ చీఫ్ సత్కరించారు. రాహుల్‌గాంధీపై ఉన్న అభిమానంతో వినుకొండ నుంచి న్యూఢిల్లీ వరకు 1,858 కిలోమీటర్ల సైకిల్ యాత్ర చేపట్టాడని తెలిపారు.

ఆశ వర్కర్లకు ఎలక్షన్ డ్యూటీ రెమ్యూనరేషన్ ఇవ్వాలి



నిరసన తెలుపుతున్న ఆశ వర్కర్లు

నిర్మల్‌చైన్‌గేట్:నవంబర్ 30న నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా విధులు నిర్వహించిన ఆశ వర్కర్లకు రెమ్యూనరేషన్ ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు పి.గంగమణి కోరారు. తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ తరఫున డీఎంహెచ్‌వో కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉద్యోగులతో సమానంగా ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆశ వర్కర్లు విధులు నిర్వహించారన్నారు. ఈమేరకు రెమ్యూనరేషన్ రూ.550 చొప్పున చెల్లించాలని కోరారు. కంటి వెలుగు విధుల పారితోషకం కూడా చెల్లించాలని డిమండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చినవారిలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు విజయభాగ్య, ఆశ వర్కర్లు సరిత, ఇంద్రమాల, సుశీల, విజయ, లక్ష్మి, కమల, సుగుణ, జ్యోతి, లక్ష్మి ఉన్నారు.

కౌన్ బనేగా ఎమ్మెల్యే..?

- నేడే కౌంటింగ్..
- గెలిచేదెవరు..? ఓడేదెవరు..?
- గంటగంటకూ పెరుగుతున్న ఉత్కంఠ
- అంచనాలకు అందని ఫలితం
- కొన్నిగంటల్లో తేలనున్న భవితవ్యం
- చివరిదాకా ఆశలపల్లకిలో అభ్యర్థులు



నిర్మల్ పాలిటెక్నిక్ కళాశాలలో కౌంటిగ్ కోసం చేసిన ఏర్పాట్లు..

నిర్మల్:ఐదేళ్లపాటు పాలించే ఎమ్మెల్యే యోగం ఎవరికుందో.. మరికొన్ని గంటల్లోనే తేలిపోనుంది. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో కారు.. జోరు కొనసాగించనుందా..? కమలం.. తొలిసారి వికసించనుందా..? కాంగ్రెస్.. చెయ్యెత్తి జైకొట్టనుందా..? తెలిసిపోతుంది. ముక్కోణపు సమరం ఫలితమేంటో మధ్యాహ్నంలోపే స్పష్టమవుతుంది. హోరాహోరీ అసెంబ్లీ పోరులో ఓటరు ఎవరికి పట్టం కట్టాడో.. ఎవరినీ ఇంటికి పరిమితం చేస్తున్నాడో.. వెల్లడవుతోంది. గంటగంటకూ ఉత్కంఠగాసాగే కౌంటింగ్ ప్రక్రియను ఆదివారం సజావుగా పూర్తిచేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. నిర్మల్ పాలిటెక్నిక్ కళాశాలలో ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. కట్టుదిట్టమైన మూడంచెల భద్రతావలయంలో మూడు నియోజకవర్గాల ఓట్లను లెక్కించనున్నారు. కౌంటింగ్ ప్రారంభం నుంచి చివరిదాకా అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలతోపాటు సాధారణ ప్రజలూ సహకరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ ప్రవీణ్‌కుమార్ కోరారు.

హాట్ ఫైట్..

గతంలో ఎన్నడూ లేనంతగా ఈసారి అసెంబ్లీ ఎన్నికలు హాట్.. హాట్‌గా సాగాయి. చలికాలంలోనూ పార్టీలు, అభ్యర్థుల మాటలతో వేడి పుట్టించాయి. ఎన్ని సర్వేలు చేసినా.. స్పష్టమైన ఫలితాలు రాకపోవడం, జిల్లాలో ఒకలా.. రాష్ట్రంలో మరోలా ఎగ్జిట్‌పోల్స్ చూపడంతో ఈసారి ఫలితాలు ఆసక్తికరంగా మారాయి. అభ్యర్థుల్లోనూ కౌంటింగ్ గుబులు రేపుతోంది. బుల్లిపెట్టెలో దాగిన భవితవ్యం ఎలా ఉండనుందోనన్న టెన్షన్ అభ్యర్థుల్లో కనిపిస్తోంది. సర్వేలు, వివిధ సంస్థల ద్వారా ప్రజానాడిని పసిగట్టే ప్రయత్నం చేసినా.. వాటితో వారికి మనశ్శాంతి మాత్రం కరువైంది.

అ'టెన్షన్'..!!

ఈసారి గెలుపు ఎవరికీ అంత ఈజీ కాదన్న విషయం స్పష్టమైంది. ఉదయం 8 గంటలకే కౌంటింగ్ బెల్ మోగడంతోనే.. ఫలితం ఎలా వస్తుందోనన్న టెన్షన్ అన్ని పార్టీల్లోనూ పెరుగుతోంది. ఇప్పటికే వేసుకున్న అంచనాలు, పార్టీ నాయకులతో వేయించిన లెక్కలకు తగ్గట్లుగా ఫలితం ఉంటుందా.. లేదా.. అన్న కంగారుతోనే అభ్యర్థులు కౌంటింగ్ కేంద్రాల్లోకి వెళ్తున్నారు. ఇలాంటి టెన్షన్.. టెన్షన్.. వాతావరణంలో కొన్ని గంటల్లోనే 'కౌన్ బనేగా ఎమ్మెల్యే..' అనేది తేలిపోనుంది.

జిల్లాలో రెండోసారి..

నిర్మల్ జిల్లాగా ఏర్పడిన తర్వాత శాసనసభ ఎన్నికలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు రెండోసారి కొనసాగుతోంది. 2014 ఎన్నికల వరకు కౌంటింగ్ కేంద్రాలను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకేంద్రమైన ఆదిలాబాద్‌లోనే ఏర్పాటు చేసేవారు. కొత్త జిల్లాలు ఏర్పాటైన తర్వాత 2018లో జరిగిన ఎన్నికలకు సంబంధించిన లెక్కింపు ఇక్కడే చేపట్టారు. ఇప్పుడు రెండోసారీ జిల్లాకేంద్రంలోనే లెక్కిస్తున్నారు.

రౌండ్.. రౌండ్‌కూ ఉత్కంఠ..

జిల్లాలోని నిర్మల్, ముధోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికలు పోటాపోటీగా సాగాయి.

- ఖానాపూర్ నియోజకవర్గంలో 78.18 శాతం, నిర్మల్‌లో 77.28 శాతం, ముధోల్ నియోజకవర్గంలో 80.56 శాతం, మొత్తం జిల్లాలో 78.67 శాతం పోలింగ్ నమోదైంది.
- రౌండ్ల వారీగా పోలింగ్ ఫలితాలు రానున్నాయి.
- ముందుగా పోస్టల్ బ్యాలెట్లను లెక్కించనున్నారు.
- ముధోల్ నియోజకవర్గానికి సంబంధించి 23 రౌండ్లు, నిర్మల్, ఖానాపూర్‌కు 22రౌండ్ల చొప్పున లెక్కింపు కొనసాగనుంది.
- ఒక్కో రౌండు ఫలితాలు వచ్చిన కొద్దీ లెక్కలు మారిపోతూ ఉంటాయి.
- ఉదయం 8 గంటలకు ప్రారంభమైన తర్వాత కౌంటింగ్ సజావుగా సాగితే రెండు మూడు గంటల్లోనే ఫలితాలు వెల్లడయ్యే అవకాశాలు ఉన్నాయి.

లెక్కింపు ఇలా..

- నిర్మల్ పాలిటెక్నిక్ కళాశాల భవనంలోని మూడు హాళ్లలో కౌంటింగ్ కొనసాగుతోంది.
- ఇందులో ఒక్కో హాల్‌లో 14 టేబుళ్లు ఉంటాయి.
- రిటర్నింగ్ అధికారి, అబ్జర్వర్, పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఓట్లను లెక్కించే అధికారి, కౌంటింగ్ సూపర్‌వైజర్, అసిస్టెంట్ కౌంటింగ్ సూపర్‌వైజర్, మైక్రో అబ్జర్వర్లు ఉంటారు.
- పార్టీలకు సంబంధించి ఒక్కోపార్టీ నుంచి ఒక్కో టేబుల్ వద్ద 14 మంది ఏజెంట్లు ఉంటారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు లేదా వారి తరఫున ప్రతినిధి కౌంటింగ్ కేంద్రం లోపలికి వెళ్లి చూడవచ్చు.
- కౌంటింగ్ కేంద్రాలు మొత్తం మూడంచెల సాయుధ పోలీసుల భద్రతలో ఉంటుంది.
- ముందుగా పారామిలటరీ(బీఎస్ఎఫ్) దళాలు, ఆ తర్వాత రాష్ట్ర పోలీసులు, వారి తర్వాత లోకల్ పోలీసు అధికారులు బందోబస్తుగా ఉంటారు.
- కౌంటింగ్ ప్రక్రియ అంతా సీసీటీవీ కెమెరాల్లో రికార్డు అవుతుంది.

పోలైన ఓట్ల వివరాలు..

నియోజకవర్గం	మహిళలు	పురుషులు	ఇతరులు	మొత్తం
నిర్మల్	1,06,602	89,143	12	1,95,757
ముధోల్	1,02,967	98,076	01	2,01,044
ఖానాపూర్	90,385	82,023	04	1,72,412
మొత్తం	2,99,954	2,69,242	17	5,69,213

'పల్లె'జోరు.. పట్నం బేజారు



భైంసాలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు (ఫైల్)

- పోలింగ్ 'పల్లె'వించిన చైతన్యం
- డీలాపడిన పట్టణ ఓటరు

భైంసాటౌన్:ముధోల్ నియోజకవర్గంలో పోలింగ్ సరళిని పరిశీలిస్తే పల్లెల్లోనే ఓటరు చైతన్యం కనిపించింది. నియోజకవర్గంలో భైంసా పట్టణంతోపాటు భైంసా, కుంటాల, కుబీర్, తానూరు, ముధోల్, లోకేశ్వరం, బాసర మండలాలు ఉన్నాయి. డివిజన్ కేంద్రమైన భైంసా పట్టణంలో 48,015 ఓటర్లు ఉన్నారు. మొత్తం నియోజకవర్గం ఓటర్లలో 20 శాతం ఇక్కడే ఉన్నారు. నియోజకవర్గంలో అన్ని మండలాల్లో పోలైన ఓట్లతో పోలిస్తే భైంసా పట్టణంలో తక్కువగా పోలింగ్ నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. భైంసా పట్టణంలో 60 వేలకుపైగా జనాభా ఉండగా, ఓటరు జాబితా ప్రకారం 48,015 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 30,035 మంది మాత్రమే తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. భైంసా పట్టణంలో 62.55 శాతం పోలింగ్ నమోదైంది. భైంసా పట్టణం మినహా మిగిలిన మండలాల్లో మొత్తం 2,01,539 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 1,70,949 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. పట్టణం మినహాయిస్తే అన్ని మండలాల్లో కలిపి 85 శాతం పోలింగ్ నమోదైంది.

పల్లె మహిళలే ఆదర్శం...

పట్నంతో పోలిస్తే ఓటు వేయడంలో పల్లెల్లోని మహిళా ఓటర్లే ముందంజలో ఉన్నారు. భైంసా పట్టణంలో 23,919 మంది మహిళా ఓటర్లు ఉండగా కేవలం 14,614 మంది ఓటేశారు. మొత్తం ఓట్లలో 61 శాతం మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అన్ని మండలాల్లో 1,03,873 మంది మహిళా ఓటర్లు ఉండగా, 88,409 మంది ఓటేశారు. 85 శాతం మంది గ్రామీణ మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టణంతో పోలిస్తే ఓటింగ్ శాతంలోనూ, మహిళా ఓటింగ్‌లోనూ పల్లె ఓటర్లే ఆదర్శంగా నిలిచారు.

ముధోల్ నియోజకవర్గంలో గ్రామీణ, పట్టణ ప్రాంతంలో

ఓటర్లు, పోలింగ్ వివరాలిలా...

	నియోజకవర్గం	భైంసాపట్టణం	మిగిలిన మండలాలు
మొత్తం ఓట్లు	2,49,554	48,015	2,01,539
మహిళలు	1,27,792	23,919	1,03,873
పురుషులు	1,21,744	24,088	97,656
ఇతరులు	18	08	10
పోలైన ఓట్లు	2,00,984	30,035	1,70,949
మహిళలు	1,03,023	14,614	88,409
పురుషులు	97,961	15,421	82,540
పోలింగ్ శాతం	80.54	62.55	85.00

ర్యాలీలకు అనుమతి లేదు

భైంసాటౌన్:అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న నేపథ్యంలో డివిజన్ పరిధిలో ఆదివారం విజయోత్సవ ర్యాలీలు, సభలు, సంబరాలకు అనుమతి లేదని ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా ఆదివారం ఉదయం 6 నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. అలాగే 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. కౌంటింగ్ సందర్భంగా రోడ్లపై ర్యాలీలు, టపాసులు కాల్చడం, ఊరేగింపులకు అనుమతి లేదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్:అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాల ద్వారా అనుక్షణం పర్యవేక్షణ, సాయుధ బలగాల పహారా, 144 సెక్షన్ నిషేధాజ్ఞలు అమలులో ఉన్నాయని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. కౌంటింగ్ ప్రక్రియ నిర్మల్ నియోజకవర్గంలో 306, పోలింగ్ కేంద్రాలకు 14 టేబుల్స్, 22 రౌండ్స్‌లో, ముధోల్ నియోజకవర్గంలో 312 పోలింగ్ కేంద్రాలకు 14 టేబుల్స్ 22 రౌండ్స్, ఖానాపూర్ నియోజకవర్గం కౌంటింగ్ 14 టేబుల్స్, 22 రౌండ్స్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎలాంటి అనుమానాలకు తావులేకుండా స్ట్రాంగ్‌రూంలతోపాటు వాటి పరిసరాలను అనుక్షణం పరిశీలించేందుకు నిరంతర నిఘా ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ విధులు నిర్వహించే సిబ్బంది ఉదయం 5:30 గంటలలోపు కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

కౌంటింగ్‌కు పటిష్ట భద్రత

- మూడంచెల భద్రత ఏర్పాటు చేసిన పోలీసులు
- పాలిటెక్నిక్ కళాశాలలో నేడు ఓట్ల లెక్కింపు



కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసుల బందోబస్తు

నిర్మల్‌టౌన్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్‌కు పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. అసెంబ్లీ ఎన్నికలు గురువారం ముగియగా జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను నిర్మల్ పాలిటెక్నిక్ కళాశాలకు తరలించారు. దీంతో కళాశాల చుట్టూ మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. సీఆర్పీఎఫ్, ఏఆర్, టీఎస్ఎస్పీ పోలీస్ బలగాలను మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఆదివారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానుంది. సిబ్బంది 6 గంటలకే కేంద్రానికి చేరుకోనున్నారు. జిల్లా పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంది. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు రోడ్లపై ర్యాలీలు, ఊరేగింపులు, సంబురాలు నిషేధించారు. మద్యం షాపులు మూసివేయాలని ఆదేశించారు.

ఏర్పాట్లపై ఎస్పీ ప్రత్యేక దృష్టి

జిల్లా ఎస్పీ ప్రవీణ్‌కుమార్ కౌంటింగ్ కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టిసారించారు. సీసీ కెమెరాలు ఉండేలా చర్యలు తీసుకున్నారు. కౌంటింగ్ కేంద్రంలోని సిబ్బంది వచ్చేందుకు ప్రత్యేకంగా బారికెడ్లు, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



కౌంటింగ్ కేంద్రం వద్ద పార్టీ కార్యకర్తలైనా, అభ్యర్థులైనా, ప్రజలైన నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలి. కౌంటింగ్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాం. జిల్లా పోలీసులు కేంద్ర బలగాలు అందుబాటులో ఉన్నాయి.

– ఎస్పీ ప్రవీణ్‌కుమార్

మీడియా కవరేజ్ బృందానికి ప్రత్యేక టెంట్ వేసి కౌంటింగ్ ఫలితాలను వీక్షించేందుకు ప్రొజెక్టర్ ఏర్పాటు చేశారు.

ఎన్నికల విధుల్లో అన్నీ తామై..

- ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పోలీసులు బిజీబిజీ
- పోలింగ్ మొదలుకుని కౌంటింగ్ వరకు కీలక పాత్ర



ఎన్నికల విధుల్లో పోలీసులు, ఆరోగ్యకార్యకర్తలు

నిర్మల్ ఖిల్లా:శాసనసభ ఎన్నికల నగారా మోగినప్పటి నుంచి ఎన్నికల సిబ్బందికి శిక్షణ మొదలుకుని పోలింగ్ నిర్వహణ, పంపిణీ కేంద్రాల వద్ద విధులు, ఈవీఎంలను స్ట్రాంగ్‌రూమ్‌కు చేరేవరకు భద్రత ఇలా ప్రతీ కార్యక్రమంలో కీలక పాత్ర పోషించారు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పోలీసులే. వీరి సేవల ద్వారానే ఎన్నికల నిర్వహణ ప్రక్రియ సజావుగా పూర్తయింది. వీరితోపాటు పోలింగ్‌రోజు వలంటీర్లు సైతం అమూల్యమైన సేవలు అందించారు. పోలింగ్ సజావుగా సాగడంలో అధికారులు, ఉద్యోగులు, పోలీసులు అన్ని శాఖల సమన్వయంతో విధులు నిర్వహించబట్టే ప్రక్రియ సరళతరంగా పూర్తయిందని అంటున్నారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో 922 పోలింగ్ కేంద్రాలు ఉండగా అంతే సంఖ్యలో ప్రిసైడింగ్ ఆఫీసర్లు, సహాయ ప్రిసైడింగ్ ఆఫీసర్లను కేటాయించారు. పోలింగ్ అధికారులుగా 200 మంది సేవలందించారు. సెక్టోరియల్ అధికారులుగా 90 మంది వరకు విధుల్లో ఉన్నారు. మరో 90 మంది రూట్ ఆఫీసర్లుగా వ్యవహరించారు. వీరితోపాటు కౌంటింగ్ రోజున లెక్కింపు ప్రక్రియలో దాదాపు ఒక్కో నియోజకవర్గానికి 14 టేబుళ్లను కేటాయించగా ఒక్కో టేబుల్‌కు ఒక సూక్ష్మ పరిశీలకుడు, కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్‌తోపాటు మరో 400 వరకు విధులు నిర్వహించనున్నారు. వీరితోపాటు దాదాపు 1,200 మంది పోలీస్ అధికారులు, భద్రత విభాగం, ఇతర ప్రత్యేక భద్రత విభాగ సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొన్నారు. వీరందరి సమన్వయంతోనే ఎన్నికల ప్రక్రియ పూర్తికానుంది.

'పునరావాసం'.. సమస్యలతో సహవాసం

- మౌలిక సదుపాయాలకు నోచుకోని 'గడ్డెన్న' గ్రామాలు
- మట్టి రోడ్లు, మురుగు కాలువతో ఇబ్బందులు
- ఏళ్లుగా మారని ఆ ఊళ్ల రాత



కుంబిలో రోడ్ల పరిస్థితి ఇదీ..



టాక్లి గ్రామంలో జనవాసాల మధ్య మురికి నీరు

భైంసారూరల్:వారంతా త్యాగధనులు.. ప్రాజెక్టు కోసం వారసత్వంగా వచ్చిన భూములను, పెద్దలు కట్టిన ఇళ్లను త్యాగం చేశారు. తోటి రైతుల బతుకు కోసం, బాగు కోసం భూములను ఇచ్చేశారు. గ్రామాలను ఖాళీ చేశారు. పాత గ్రామంలో సమైక్యంగా ఉన్న వారికి ప్రభుత్వం పునరావాసం కల్పించింది. సమస్యలు పరిష్కరిస్తామని ప్రాజెక్టు నిర్మాణ సమయంలో హామీలు ఇచ్చారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయింది కానీ, పునరావాస గ్రామాల సమస్యలు పరిష్కారం కాలేదు. ఏళ్లుగా సమస్యలతో సహవాసం చేస్తున్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో నిర్మాణం..

ఉమ్మడి రాష్ట్రంలోనే సుద్దవాగుపై ఈ ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయి. 2008 సంవత్సరంలో దివంగత సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రాజెక్టును ప్రారంభించారు. పునరావాసం కసం రూ.120 కోట్లు కేటాయించి ప్రాజెక్టు నిర్మించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో భైంసా పట్టణ ప్రజలకు శాశ్వత తాగునీటి పరిష్కారం దొరికింది. ప్రాజెక్టు కింద 14 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. 41 కిలోమీటర్ల మేర ప్రధాన కాలువ నిర్మించారు. ప్రధాన కాలువ ద్వారా గ్రామాల్లోని చెరువులు నింపుతూ ఆయకట్టుకు నీరందించేలా ఉప కాలువలు నిర్మించారు.

పూర్తికాని పునరావాసం...

ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి ఆయకట్టుకు నీరందుతున్నా పునరావాస గ్రామాల ప్రజల కష్టాలు తీరడంలేదు. ఏళ్లుగా ఈ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. భైంసా మండలం లింగా–1, లింగా–2, టాక్లి, కుంబి, చుచుంద్, కుభీర్ మండలం సాంవ్లీ, వాయి, లింగి, నిగ్వా గ్రామాల్లో ఇప్పటికీ పూర్తిస్థాయిలో పనులు కాలేదు. నేటికి పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించలేదు.

రోడ్లు లేవు...

పునరావాస గ్రామాల్లో పూర్తిస్థాయిలో ఇప్పటికీ సీసీ రోడ్లు కూడాలేవు. రోడ్లులేక వర్షాకాలంలో బురద నుంచే స్థానికులు నడక కొనసాగిస్తున్నారు. వర్షాకాలంలో అయితే గ్రామాల్లోని అంతర్గత రోడ్లపై ద్విచక్రవాహనాలు కూడా నడవవు. నల్లరేగడి నేలలు కావడంతో కొద్దిపాటి వర్షం పడ్డ రోడ్లన్నీ బురదమయం అవుతున్నాయి.

డ్రైనేజీలు లేక...

పునరావాస గ్రామాల్లో డ్రైనేజీల నిర్మాణం పూర్తికాలేదు. దీంతో మురికినీరంతా ఇళ్లముందే నిలిచి ఉంటుంది. ప్రధాన కూడళ్లలో నిలిచి ఉన్న మురికి నీటితో దుర్గంధం వెదజల్లుతోంది. దోమలకు ఆవాసంగా మారుతున్నాయి.

పాఠశాలల్లో...

పునరావాస గ్రామాల్లో పాఠశాలల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోతున్నాయి. పక్కనే ప్రాజెక్టు ఉండడంతో పరిసరాల్లో పాముల బెడద పెరిగింది. ఈ పాఠశాలల్లో మరుగుదొడ్లు సరిగాలేక విద్యార్థులు ఆరుబయటకు వెళ్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పునరావాస గ్రామాల్లోని పాఠశాలల్లో మరుగుదొడ్లు నిర్మిస్తే విద్యార్థులు ఆరుబయట వెళ్లాల్సిన పరిస్థితులు తలెత్తవు. పిల్లలకు ఆడుకునేందుకు మైదానాలు నిర్మించలేదు.

ఇబ్బందులు తీర్చాలి



పునరావాస గ్రామాల ఇబ్బందులను తీర్చాలి. ప్రత్యేక అధికారి సందర్శించి సమస్యలు తెలుసుకోవాలి. ప్రధాన సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి. అధికారులు వచ్చినప్పుడల్లా సమస్యలపై చర్చిస్తున్నా పరిష్కారం మాత్రం చూపడంలేదు.

– భోజారాం, కుంబి

క్లుప్తంగా

క్రికెట్ చాంపియన్‌గా ఆదిలాబాద్

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శనివారం జోనల్ (ఉమ్మడి జిల్లా) స్థాయి బాలుర అండర్ 17 బాయ్స్ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు చెందిన జట్లు పోటీ పడగా ఆదిలాబాద్ జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో ఆదిలాబాద్ జట్టు ఆసిఫాబాద్ జట్టును ఓడించి కప్ కైవసం చేసుకుంది. విజేతగా నిలిచిన జట్టుకు జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు హరిచరణ్, రాష్ట్ర పాల్, జయేంద్ర పటాస్కర్ ఉన్నారు.

గోల్డ్ వర్క్‌షాప్‌లో దొంగతనం


చోరీకి గురైన దుకాణం

కడెం: మండల కేంద్రంలోని గోల్డ్ వర్క్‌షాప్‌లో శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. షాపులోనుంచి సుమారు లక్ష రూపాయల విలువ గల తులం బంగారం, అర కిలో వెండి ఎత్తుకెళ్లినట్లు షాపు యజమాని సతీశ్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు వర్క్‌షాపును పరిశీలించారు. విచారణ చేపట్టి దొంగలను పట్టుకుంటామని ఎస్సై రాజు పేర్కొన్నారు.

'పొంగులేటి'కి సీఎం పదవి ఇవ్వాలి



మాట్లాడుతున్న సంతోష్

మందమర్రిరూరల్(చెన్నూర్): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే పొంగులేటి శ్రీనివాసరెడ్డికే ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని తెలంగాణ మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చిలుక సంతోష్ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌లో చేరిన తర్వాతే ఇతర పార్టీల నుంచి ముఖ్యులు వచ్చి చేరారని, చాలాచోట్ల రాహుల్‌గాంధీ సభలు విజయవంతం అయ్యాయన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు శేఖర్, కుమార్, రాజేశ్, రాజు, స్వామి, వేణు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

తనిఖీ చేసి.. ఫైన్ వేసి


ఫైన్ రాస్తున్న ఆర్టీసీ అధికారులు

భీమిని(బెల్లంపల్లి): 'టికెట్ లేని ప్రయాణం నేరం....అందుకు రూ.500 జరిమానా చెల్లించాల్సి ఉంటుంది' అనే నినాదం ఆర్టీసీ బస్సుల్లో రాసి ఉంటుంది. దీనికి తగ్గట్టుగా శనివారం దహెగాం నుంచి మంచిర్యాలకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును జన్కాపూర్ వద్ద విజిలెన్స్ అధికారులు ఆపి తనిఖీ చేశారు. ఓ మహిళ టికెట్ తీసుకోకపోవడంతో రూ.30 టికెట్ చార్జీతో పాటు రూ.500 జరిమానా విధించారు.

9న లక్ష దీపోత్సవం

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 9న లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు శ్రీ గోదా రంగనాథ కోలాట బృందం నిర్వాహకురాలు మంజుభాషిణి తెలిపారు. చిన్నజీయర్‌స్వామి మంగళ శాసనంతో శ్రీ త్రిదండి దేవనాథ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో శనివారం లక్ష దీపోత్సవం నిర్వహించనున్నారు.

ఎవరు గెలిచినా..!!

- హామీల అమలుకు ప్రాధాన్యతనివ్వాల్సిందే
- ప్రజల మన్ననలు పొందితేనే స్థానం
- రాజకీయంగా ఎదిగే అవకాశం
- సమస్యల పరిష్కారమే ప్రధానలక్ష్యం కావాలి..
- ఫలితాలవెల్లడి నేపథ్యంలో ఓటర్ల అభీష్టమిదే



నిర్మల్‌ఖిల్లా: రాష్ట్ర శాసనసభ ఎన్నికల ఫలితాలు ఆదివారం వెలువడనున్నాయి. జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో ప్రధాన రాజకీయ పార్టీల నుంచి పోటీ చేసిన అభ్యర్థులతో పాటు ఇతర రిజిస్టర్ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారు. అయితే విజయ పతాకాన్ని ఎగురవేసిన అభ్యర్థులు రానున్న ఐదేళ్లపాటు ఎమ్మెల్యేగా కొనసాగుతారు. గెలిచిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకొని ఐదేళ్లపాటు హామీల అమలు, ప్రజాసమస్యల పరిష్కారం దిశగా శ్రమిస్తే వారి రాజకీయ భవిష్యత్తుకు పునాదులు పడతాయి. ప్రస్తుతం ఎన్నికల్లో పోటీ చేస్తున్న సీనియర్ అభ్యర్థులతో పాటు ఇంతవరకు ఎమ్మెల్యేలుగా ఎన్నిక కానీ అభ్యర్థులు కూడా పోటీలో ఉండి గట్టిపోటీ ఉండడంతో ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ తదితర పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులూ పోటీపడ్డారు. గెలిచే అభ్యర్థులు ఎవరైనా అంతిమ లక్ష్యం ప్రజాఆమోదంతో కూడిన అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూనే ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరుతున్నారు. అదే సమయంలో తమ పార్టీ, తాను ప్రజలకు ఇచ్చిన హామీల పట్ల దృష్టిసారించాలని కోరుతున్నారు. జిల్లాలోని ఈ మూడు నియోజకవర్గాల పరిధిలో ఏ పార్టీ అభ్యర్థి గెలిచిన కూడా ఇదే లక్ష్యంగా పనిచేస్తేనే వారికి మరోసారి పట్టంకట్టే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల యువత సాక్షితో తమ అభిప్రాయాలను ఇలా పంచుకున్నారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి..



ఎన్నికల సమయంలో పోటీలో ఉన్న అభ్యర్థులు తమ పార్టీల మేనిఫెస్టోలతో పాటు స్థానికంగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా ప్రయత్నించాలి. గెలిచిన తర్వాత ఐదేళ్లపాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం దిశగా కృషి చేయాలి. ప్రధానంగా యువతకు ఉద్యోగ,ఉపాధి కల్పన వంటి హామీలను నెరవేర్చాలి.

– ఈరడి రవి, ప్రైవేటు లెక్చరర్, భైంసా

మరింత అభివృద్ధి జరగాలి...



ఖానాపూర్ నియోజకవర్గం ఇప్పటికీ వెనుకబడి ఉంది. విశాలమైన ఈ నియోజకవర్గంలో ఎస్టీ సామాజిక వర్గ జనాభాతో పాటు మిగిలిన సామాజిక వర్గం ప్రజలు కూడా వెనుకబడి ఉన్నారు. ఖానాపూ ర్ పరిధిలోని అనేక గ్రామాలు ఇప్పటికీ సరైన రోడ్డు సౌకర్యం, మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గెలిచే ఎమ్మెల్యే ఎవరైనా నియోజకవర్గ అభివృద్ధి పట్ల చిత్తశుద్ధితో పనిచేయాలి.

– గోస్కుల రాజుమహేందర్, లింగాపూర్, కడెం

రాజకీయాలకతీతంగా ప్రజాసంక్షేమం కొనసాగాలి..



ఎన్నికలప్పుడు కొనసాగే రాజకీయాల తదుపరి ఐదేళ్లపాటు వదిలేయాలి. ప్రజా సంక్షేమం పై గెలిచిన నాయకుడు దష్టి పెట్టాలి. సంక్షేమ పథకాలు, ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రయత్నించాలి. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలి.

– జి.ప్రవీణ్, ఆలూర్, మం॥ సారంగపూర్

కాయ్ రాజా.. కాయ్

- నేడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు
- ఫలితాలపై రూ.కోట్లలో బెట్టింగ్
- పందెం కాస్తున్న వ్యాపారులు, నేతలు, యువకులు



కౌటాల(సిర్పూర్): అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో జిల్లాలో బెట్టింగ్‌ల జోరు ఊపందుకుంది. సార్వత్రిక ఎన్నికల్లో అన్ని ప్రధాన పార్టీల అభ్యర్థులు పోటీలో ఉన్నారు. నేడు ఓట్ల లెక్కింపు ఉండడంతో అభ్యర్థుల గెలుపోటముల బెట్టింగ్ జోరు సాగుతోంది. ప్రధాన కూడళ్లలో నలుగురు కలిసి కూర్చుంటే చాలు అభ్యర్థుల విజయావకాశాలపైనే ప్రధానంగా చర్చ జరుగుతోంది. మరికొందరు ఒక అడుగు ముందుకేసి అభ్యర్థుల గెలుపోటములపై పందెం కడుతూ తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

ఫలితాలు నేడే

బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ పార్టీల అభ్యర్థులపై బెట్టింగ్ జోరుగా సాగుతోంది. అభ్యర్థుల గత చరిత్ర , ప్రస్తుత బలాబలాలు, బలహీనతలపై ప్రజలు, రాజకీయ విశ్లేషకుల మధ్య ప్రధానంగా చర్చ జరుగుతోంది. క్రికెట్ బెట్టింగ్ మాదిరి చైన్ పద్ధతిలో కాకుండా వ్యక్తిగతంగా డబ్బుల పంపకం నిర్వహిస్తున్నారు. నేడు ఓట్ల లెక్కింపు ఉండడంతో తమ పార్టీ అభ్యర్థులు గెలుస్తారని ఒకరు, కాదు తమ నాయకుడే గెలుస్తాడని ఇంకొకరు బెట్టింగ్‌లు కడుతున్నారు.

రూ.కోట్లలోనే బెట్టింగ్..!

జిల్లాలో క్రికెట్ బెట్టింగ్‌లు, మట్కా, జూదం విచ్చలవిడిగా సాగిన సందర్భాలు గతంలో అనేకం ఉన్నాయి. ఈజీ మనీకి అలవాటు పడ్డ బడా బాబుల బిడ్డలు ఈ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. తమ విశ్లేషణ ప్రకారం ఫలానా అభ్యర్థి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందుతాడు చూడండి.. అంటూ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. రూ.5 వేల నుంచి మొదలుకొని రూ.లక్ష వరకు పందెం కాస్తున్నారు. ఈ సారి ఎన్నికలు హోరాహోరీగా జరిగాయని, ఏ పార్టీ అభ్యర్థికి భారీ మెజార్టీ రాదని కార్యకర్తలు బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు. ఆయా పార్టీల అభిమానులు తమ అభ్యర్థుల గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తూ బెట్టింగ్‌లు నిర్వహించినట్లు తెలుస్తోంది. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాలతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వ్యాపారులు సైతం ఈ బెట్టింగ్‌లో పాల్గొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికల్లో రూ.కోట్లలోనే బెట్టింగ్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపోటములతో పాటు రాష్ట్రంలో ఫలానా పార్టీ అధికారంలోకి వస్తుంది. ఫలానా వ్యక్తి ముఖ్యమంత్రిగా బాధ్యతలు సైతం స్వీకరిస్తాడంటూ.. కావలిస్తే బెట్ కట్టండి అంటూ ఒకరినొకరు రెచ్చగొడుతున్నారు.

- దహెగాం మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాల్వాయి హరీష్‌బాబు, బీఎస్పీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలుపుపై ఆయా పార్టీల నాయకులు, వ్యాపారులు, యువకులు రూ.లక్షల్లో బెట్టింగ్ కడుతున్నారు.
- ఆసిఫాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుపై పార్టీ కార్యకర్తలు, వ్యాపారులు, యువకులు జోరుగా బెట్టింగ్ కడుతున్నారు.
- బెజ్జూర్ మండలంలోని కార్యకర్తలు బెట్టింగ్‌లో తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. తమ అభిమాన నాయకుడు ఎన్నికల్లో గెలుస్తాడని వ్యవసాయ భూములను సైతం బెట్టింగ్ పెడుతున్నారు.
- కౌటాల మండల కేంద్రానికి చెందిన ఆయా ప్రధాన పార్టీల నాయకులు నగదుతో పాటు ద్విచక్ర వాహనాలు, కార్లు బెట్టింగ్ కడుతున్నారు.

గో సేవ.. సేంద్రియ తోవ

- ఒక్క ఆవుతో గోశాల ప్రారంభం
- ప్రస్తుతం 26 చేరుకున్న గోవులు
- ఆవు పేడ, మూత్రంతో సేంద్రియ ఎరువు తయారీ
- ఆదర్శం.. శివలింగాపూర్ గోశాల


సతీశ్ ఇంటి వద్ద ఉన్న గోశాలలో ఉన్న ఆవులు

చెన్నూర్‌రూరల్: వ్యవసాయరంగంలో ఎద్దులు ప్రధాన పాత్ర పోషిస్తాయి. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో ఏ ఇంటిముందు చూసినా ఆవులు, గేదెలు, ఎద్దులు కనిపించేది. స్వచ్ఛమైన పాలకోసం పల్లెల్లో ఇంటింటా ఆవులు, గేదెలను పెంచేవారు. కానీ రాను రాను వాటి పోషణ భారమైంది. ఆవులను పోషించడం చాలా కష్టతరంగా మారడంతో పల్లెల్లో పశు సంపద తగ్గుతూ వస్తోంది. ఇక పట్టణాల్లో ఆవులకు సరైన మేత దొరకక ప్లాస్టిక్ కవర్లు, చిత్తు కాగితాలు తింటున్నాయి. కానీ మండలంలోని శివలింగాపూర్ గ్రామానికి చెందిన గోనె సతీశ్ అనే రైతు మాత్రం గోమాతపై ఉన్న మక్కువతో తన ఇంటి వద్ద ప్రత్యేకంగా గోశాలను ఏర్పాటు చేశాడు. 2016లో ఒక్క ఆవుతో గోశాలను ప్రారంభించాడు. మధ్యలో ఎన్నో ఒడిదుడుకులు వచ్చినా పట్టు వీడకుండా నెమ్మది, నెమ్మదిగా ఆవుల సంఖ్యను పెంచుతూ వచ్చాడు. ప్రస్తుతం గోశాలలో ఆవుల సంఖ్య 26కు చేరుకుంది. గోవుల కోసం ప్రత్యేకంగా ఇంటివద్ద తనకున్న ఎకరా స్థలంలో 10 గుంటల స్థలంలో షెడ్డు ఏర్పాటు చేశాడు. 20 గుంటల్లో కూరగాయలు, మరో పది గుంటల్లో ఆవుల మేత కోసం పచ్చిగడ్డి పెంచుతున్నాడు. ఆవులకు ప్రతీరోజు ఉదయం, సాయంత్రం పచ్చిగడ్డి, తౌడు, ఇతర దాణా అందిస్తున్నాడు. సతీశ్ సోదరుడు భాస్కర్, కుటుంబ సభ్యులు అతనికి గోశాలలో చేదోడు, వాదోడుగా ఉంటున్నారు.

గృహ ప్రవేశాలకు ఉచితం

కొత్తగా నిర్మించుకున్న ఇళ్లల్లో మొదటిసారి తప్పనిసరిగా ఆవు, లేగదూడలతో గృహ ప్రవేశం చేయించడం ఆనవాయితీ. ఆవు, లేగదూడలను నూతన గృహ ప్రవేశానికి తీసుకు వచ్చేందుకు ఎంతో కొంత డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. కానీ సతీశ్ మాత్రం నూతన గృహ ప్రవేశాలకు ఆవు, లేగదూడలను ఉచితంగా పంపిస్తున్నాడు. ఇందుకు డబ్బులు ఇవ్వకుండా వాటికి దాణా పెడితే చాలంటున్నాడు.

సేంద్రియ ఎరువుల తయారీ

ఆవు పేడ, మూత్రంతో సేంద్రియ ఎరువులను తయారు చేస్తున్నాడు. సేంద్రియ ఎరువుతో కూరగాయలను సాగు చేస్తున్నాడు. ద్రవ, ఘన జీవామృతం ఎరువులను తయారు చేసి కూరగాయల సాగులో నాణ్యమైన దిగుబడులు సాధిస్తున్నాడు. త్వరలోనే మరిన్ని ఆవులను తీసుకు వస్తానని, ఎవరైనా ఆవులు పంపిస్తే కూడా వాటిని కూడా గోశాలలో ఉంచి పెంచడం జరుగుతుందని సతీశ్ చెబుతున్నాడు. అందుకు తనను 9000402074 నంబరులో సంప్రదించాలని కోరుతున్నాడు.

గోమాత అంటే ఎంతో ఇష్టం



మాది వ్యవసాయ కుటుంబం. నాకు గోమాత అంటే ఎంతో ఇష్టం. అందుకే గోశాల పెట్టాలని కోరిక. మాకు ఇంటి వద్ద ఎకరా స్థలం ఉంది. అందులోని పది గుంటల స్థలంలో షెడ్డు నిర్మించి ఒక్క ఆవుతో గోశాల ప్రారంభించా. ప్రస్తుతం 26 వరకు ఆవులు ఉన్నాయి.

– గోనె సతీశ్, గోశాల నిర్వాహకుడు, శివలింగాపూర్

తల్లీకూతుళ్ల ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ తల్లి మృతి
- కూతురి పరిస్థితి విషమం


నిర్మల మృతదేహం

తాండూర్(బెల్లంపల్లి): వ్యక్తిగత కారణాలతో తల్లీకూతుళ్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బోయపల్లి గ్రామానికి చెందిన గొడిసెల నిర్మల (40) భర్త గతంలోనే మృతి చెందగా కూతురు రచన (19)తో కలిసి నివాసం ఉంటోంది. శుక్రవారం రాత్రి వ్యక్తిగత కారణాలతో ఇద్దరూ గొడవ పడ్డారు. తల్లి మందలించడంతో మనస్థాపానికి గురైన రచన ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన నిర్మల తానూ గడ్డిమందు తాగింది. స్థానికులు ఇరువురిని బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి నిర్మల శనివారం తెల్లవారు జామున మృతి చెందింది. రచన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై నిర్మలకు సోదరుడి వరుసైన ఇడిగిరాల కిరణ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువకుడి అదృశ్యం


ముత్యం

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి గ్రామానికి చెందిన పంగి ర ముత్యం అనే యువకుడు అదృశ్యమయ్యాడు. ఎస్సై సా యికుమార్ వివరాల ప్రకారం... పంచగుడి గ్రామానికి చెందిన పంగిర ముత్యం గురువారం రాత్రి ఇంటి నుంచి బయలుదేరి శుక్రవారం వరకు ఇంటికి రాలేదు. అతడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు బంధువుల వద్ద, చుట్టుపక్కల గ్రామాల్లో ఆరా తీశారు. కానీ ఆచూకీ లభించకపోవడంతో ముత్యం తండ్రి పెద్ద నాగన్న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై శనివారం వెల్లడించాడు.

మృతదేహాలకు పోస్టుమార్టం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని బెస్తవాడలో శుక్రవారం రాత్రి హత్యకు గురైన బామ్నె శ్రీను, గుబిడె శ్రావణ్ మృతదేహాలను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలోని పోస్టుమార్టం గదికి తరలించారు. శనివారం వైద్యులు రెండు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అజ్మీరా శ్యామ్‌నాయక్ మృతుల కుటుంబాలను పరామర్శించారు. ప్రతీకార హత్యలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ వెంకటరమణ తెలిపారు. కాగా జిల్లా కేంద్రంలో రెండు హత్యలు జరగడం కలకలం రేపింది.

ప్రచారం డబ్బులడిగిన మహిళపై దాడి


గాయపడిన ఈశ్వరమ్మ

మందమర్రిరూరల్(చెన్నూర్): ఎన్నికల ప్రచారంలో తిప్పుకుని డబ్బులడిగితే దాడి చేసిన సంఘటన మందమర్రిలో చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డుకు చెందిన వృద్ధ దంపతులు తాళ్ల ఈశ్వరమ్మ, బాపు ఈ నెల 26, 27 తేదీల్లో బీఆర్ఎస్ నాయకులు ప్రచారానికి పిలిస్తే వెళ్లారు. ఒక్కొక్కరికి రోజుకు రూ.300ల చొప్పున రెండు రోజులకు కలిపి ఇద్దరికి రూ.1200లు రావాల్సి ఉండగా ఈశ్వరమ్మ నాయకులు కర్ణాకర్ ఇంటికి వెళ్లి అడిగింది. దీంతో అతని భార్య దాడికి పాల్పడడంతో కుడి చేతికి గాయమైంది. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధితురాలు పేర్కొంది. ఇదిలా ఉంటే మందమర్రిలో అంతా ఇదే పరిస్థితి నెలకొందని, ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓటర్లకు డబ్బులు సరిగా పంపిణీ చేయలేదని, నాయకుల ఇంటిచుట్టూ తిరిగితే బెదిరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఎస్సై చంద్రకుమార్‌ను వివరణ కోరగా దీనిపై కొంత మంది పిటిషన్ ఇచ్చారని, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కారు, బైక్ ఢీ..ఒకరికి తీవ్ర గాయాలు

దండేపల్లి: మండలంలోని నెల్కివెంకటాపూర్ సమీపంలో శనివారం కారు, బైక్ ఢీ కొన్న ఘటనలో దండేపల్లికి చెందిన పాలకుర్తి లక్ష్మణ్ తీవ్రంగా గాయపడ్డాడు. బైక్‌పై వస్తున్న లక్ష్మణ్‌ను కారు బలంగా ఢీకొట్టడంతో అతనికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

ముగిసిన మధున పోచమ్మ జాతర


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

కోటపల్లి(చెన్నూర్) మండలంలోని జనగామలో మూడు రోజులుగా కన్నుల పండువగా సాగిన మధున పోచమ్మ జాతర శనివారం ముగిసింది. శివసత్తుల పూనకాలు, డప్పుచప్పుళ్లు, బోనాలతో భక్తులు అమ్మవారి చెంతకు చేరుకున్నారు. కొత్తకుండలో వండిన పాయసం అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి సల్లంగా చూడు తల్లీ అంటూ వేడుకున్నారు. మొదటిరోజు గోదావరి పుణ్యస్నానంతో జాతర ప్రారంభం కాగా రెండో రోజు రథయాత్ర, మూడో రోజు బోనాల సమర్పణతో జాతర ముగిసింది. జాతరకు జనగామ, వెంచపల్లి, సుపాక, నందరాపల్లి, ఆలుగామ, ఎదులబందం, బొప్పారం గ్రామాలతో పాటు చెన్నూర్ పొరుగునే ఉన్న మహారాష్ట్ర నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ గట్టు లక్ష్మణ్‌గౌడ్ ఏర్పాట్లు చేశారు.

హ్యాండ్‌బాల్ జోనల్‌స్థాయి ఎంపిక పోటీలు


క్రీడాకారులతో ఉపాధ్యాయులు

భీమారం(చెన్నూర్): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో శనివారం అండర్ -14 బాలబాలికల, అండర్-17 బాలుర హ్యాండ్ బాల్ జోనల్ స్థాయి ఎంపిక పోటీలు ప్రారంభించారు. ఇందులో ఎంపికైన వారు త్వరలో జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పాల్గొంటారని జిల్లా క్రీడా సమాఖ్య కార్యదర్శి పరిమళ తెలిపారు. ఈ పోటీలలో మొత్తం 200 మంది బాల బాలికలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పోటీల కన్వీనర్, పాఠశాల హెచ్ఎం విక్రమ్‌కుమార్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ క్రీడల అధికారి బండ మీనారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు విఠల్, సదానందం, సాగర్, శ్రీనివాస్, రవి, రాకేష్, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా

- ఎనిమిది మందికి తీవ్రగాయాలు
- ఘటన సమయంలో వాహనంలో 23 మంది కూలీలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కూలీలు

తిర్యాణి(ఆసిఫాబాద్): ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో పలువురికి గాయాలైన సంఘటన మండలంలోని గుండాల గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం గుండాల గ్రామానికి చెందిన 23 మంది పత్తి తీత కూలీలు ట్రాక్టర్‌లో రోంపెల్లికి వెళ్తుండగా మార్గమధ్యలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో 8 మందికి తీవ్రంగా మరి కొంతమందికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడిన ఎనిమిది మందిని మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ గణేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మస్టర్‌ను ప్లేడేగా పరిగణించాలి


మాట్లాడుతున్న పత్తెం రాజాబాబు

రెబ్బెన(ఆసిఫాబాద్): ఎన్నికల్లో విధులు నిర్వహించిన సింగరేణి కార్మికుల మస్టర్‌ను ప్లేడేలుగా పరిగణించాలని హెచ్ఎంఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు డిమాండ్ చేశారు. శనివారం గోలేటిలోని హెచ్ఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఎన్నికల విధులు నిర్వహించినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా చూడకపోవడం బాధాకరమన్నారు. సింగరేణిలో సెలవు దినం విధులు నిర్వహించిన వారికి రెండు మస్టర్లు చెల్లించే యాజమాన్యం ఎన్నికల్లో విధులు నిర్వహించిన సింగరేణి క్లర్కులు, ఎస్అండ్‌పీసీ సిబ్బంది, ఇతర కార్మికులకు ప్లేడేలు కల్పించకపోవడం అన్యాయమన్నారు. సమావేశంలో ఏరియా ఆర్గనైజర్ ఎస్కే ఇనూష్, ఎస్అండ్‌పీసీ పిట్ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, హాస్పిటల్ ఇన్‌చార్జి ఆర్. శ్రీనివాస్, భిక్షపతి పాల్గొన్నారు.